భక్తులకు అన్నదానం


పటాన్‌చెరు: దేవి నవరాత్రులను పురస్కరించుకొని అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని పలుకాల నీలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నరసింహగౌడ్‌ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవి నవరాత్రులు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం వివిధ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ నందారం నరసింహగౌడ్‌, నందారం రమేష్‌గౌడ్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భెల్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్‌ కార్మికులకు అండగా ఉండి వారి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మెదక్‌ ఎంపీ రఘునందన్‌ రావు అన్నారు. సోమవారం భెల్‌ టౌన్‌షిప్‌లో కొద్ది రోజుల క్రితం యువకుల దాడిలో గాయపడిన భెల్‌ కార్మికుడు కార్తీక్‌చంద్ర మహాపత్‌ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భెల్‌ యాజమాన్యం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుడిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రాజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం: డీసీ

రాజేంద్రనగర్‌: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు సందర్శించి పరిష్కరిస్తున్నారని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ రవి కుమార్‌ తెలిపారు. సోమవారం సర్కిల్‌ కార్యాలయంలో ప్రజావాణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సర్కిల్‌ పరిధిలోని 5 డివిజన్లలో నివసిస్తున్న ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని విభాగాల అధికారులు ప్రతి సోమవారం ఉంటారని, ఎలాంటి సమస్యలున్నా ప్రజావాణీ కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. సోమవారం అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించామని త్వరలో పరిష్కరిస్తామన్నారు.


సాయిఐశ్వర్య ఆలయంలో మహాలక్ష్మీగా ముత్యాలమ్మ


దనలక్ష్మీగా కొత్తగూడలోని అమ్మవారు


మహా చండీదేవిగా ఊరపోచమ్మ అమ్మవారు


లలితాదేవిగా రాజరాజేశ్వరిమాత


శివసాయిక్షేత్రంలో చండీహోమం, నవచండీయాగం

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రి వేడుకలు

దుర్గమ్మ దర్శనం..
పులకించిన భక్తజనం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఆలయాలు, కూడళ్లలో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర పూజలు, అభిషేకాలు, అలంకారాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సామూహికంగా కలశ పూజ, లక్ష్మీ, విష్ణు సహస్రపారాయణాలు, చండీహోమం, నవ చండీయాగం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవికి లలితాదేవి అలంకారం, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరిమాతకు లలితాదేవి అలంకారం, రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో అమ్మవారికి మహాచండీదేవి అలంకారం, కొత్తగూడలోని అమ్మవారికి ధనలక్ష్మీ అమ్మవారి అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. – గచ్చిబౌలి/రాయదుర్గం


జీపీఆర్‌ఏక్వార్టర్స్‌లో..


విఠల్‌రావునగర్‌లో..


ఖాజాగూడలో ముత్యాలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చన


సామూహిక కలశ పూజల్లో భక్తులు, నిర్వాహకులు


రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో పూజలు


మియాపూర్‌లో.. ఎమ్మెల్యేగాంధీ, కార్పొరేటర్‌ శ్రీకాంత్‌


రాయదుర్గంలో సామూహిక కుంకుమార్చన

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 70, పచ్చిమిర్చి 40, బెండ 50, కాకర 50, దొండ 60, దోస 50, ఆలు 40, చామ 50, కీర 40, బీర 70, వంకాయ 40, గోకర 50, బీన్స్‌ 100, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 80, క్యాబేజీ 25, క్యారెట్‌ 50, చిక్కుడు 60, ఉల్లి 70(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్‌ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 300.

తెలంగాణ డయాగ్నొస్టిక్స్‌ మినీ హబ్‌ పరిశీలన



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌లోని తెలంగాణ డయాగ్నొస్టిక్స్‌ మినీ హబ్‌ను జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోన్‌ డీఎం హెచ్‌ఓ సుధాకర్‌ లాల్‌ సోమవారం పరిశీలించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్స్‌ మినీ హబ్‌లో ఏఏ సర్వీస్‌లు అందుతున్నాయో ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. రేడియాలజిస్ట్‌ లేకపోవడంతో స్కానింగ్‌లు చేయడంలేదని వివరించారు. అదే విధంగా శేరిలింగంపల్లి బస్తీ దవాఖానాను కూడా పరిశీలించారు. అక్కడ ఏఏ మందులు ఉన్నాయో..లేని మందుల వివరాలను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్‌ఎన్‌ శ్యామల, మినీ హబ్‌ మేనేజర్‌ విజయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐస్ప్రౌట్‌ సంస్థ ఆఫీస్‌ స్పేస్‌ విస్తరణ

రాయదుర్గం: మేనేజ్డ్‌ ఆఫీస్‌ స్పేస్‌ పరిశ్రమలోని ప్రముఖ సంస్థలలో ఒకటైన ఐస్ప్రౌట్‌ సంస్థ ప్రీమియం వర్క్‌స్పేస్‌ను లీజుకు ఇచ్చే స్థల విస్తరణకు సోమవారం శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలో నూతనంగా 1.7 మిలియన్‌ చదరపు అడుగులకు విస్తరించింది. ఈ కార్యక్రమాన్ని ఐస్ప్రౌట్‌ సంస్థ సహ వ్యవస్థాపకుడు, చీఫ్‌ స్ట్రాటజీ ఆఫీసర్‌ శ్రీనివాస్‌ తీర్థాల ప్రారంభించి మాట్లాడుతూ..హైదరాబాద్‌లో ఒక మిలియన్‌ చదరపు అడుగుల విస్తీర్ణంతో మా కార్యకలాపాలను బలోపేతం చేయడం మాకు సంతోషంగా ఉందన్నారు. ఈ విస్తరణ వ్యూహాత్మక వృద్ధిలో భాగం, పెరుగుతున్న సౌకర్యవంతమైన కార్యాలయ పరిష్కారాల డిమాండ్‌ను తీరుస్తుందన్నారు. ఐస్ప్రౌట్‌ సంస్థ సహ వ్యవస్థాపకురాలు, సీఈఓ సుందరి పాటిబండ్ల మాట్లాడుతూ.. మా సంస్థ వద్ద నిపుణుల కోసం వృద్ధి, ఎదుగుదలను ప్రోత్సహించే వాతావరణాన్ని సృష్టించేందుకు మేము కట్టుబడి ఉన్నామన్నారు. నగరంలోని కొత్త వర్క్‌స్పేస్‌లు అధునాతన సాంకేతికత, భద్రతా చర్యలతో కూడిన అత్యాధునిక మౌలిక సదుపాయాలను ప్రదర్శిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లాకోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. ఈ ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌ అండ్‌ డ్రైవ్‌ తనిఖీల్లో 24 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. సోమవారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా సోమవారం కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి అలరించారు. నిర్వహించిన కూచిపూడి, కథక్‌ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లక్ష్మీశంకర్‌ శిష్య బృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనలో వినాయకకౌతం, పార్వతి నందనం, రామాయణశబ్దం, వందేమీనాక్షి, వసంత తిల్లాన తదితర అంశాలను వాణి, వెంకటసృష్టి, సాహితి, పండు, అమృత వర్షిణీ, అవంతిక, కీర్తన, శ్రీవల్లి, యాషిక, మనస్విని తదితరులు ప్రదర్శించారు. అర్చన మిశ్ర శిష్యబృందంచే కథక్‌ నృత్య ప్రదర్శనలో గురువందన, రాస్‌ రచత, మధురాష్టకం, నృత్యసంగీత్‌, యమన్‌ తరాన అంశాలను లక్షిత, ఆకాంక్ష, సర్వాణి, ఇషీ, దేవంశీ, శ్రీకా, అన్వీ, అన్విత తదితరులు పాల్గొని ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.





బాధ్యతల స్వీకరణ


హబుబుల్లాఖాన్‌

గచ్చిబౌలి: గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓ హబుబుల్లా ఖాన్‌ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ పని చేశారు. ఆయనను గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా సైబరాబాద్‌ కమిషనర్‌ మహంతి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయా సెక్టార్ల ఎస్‌ఐలతో సమావేశమయ్యారు.

‘అభివృద్ధి పనులు చేపడదాం’

మణికొండ: మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభా, కాలనీలు, గేటెడ్‌ కమ్యూనిటీలకు అనుగుణంగా అభివృద్ధిని కోరుకుంటున్నారని, వారికి అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వారి మన్ననలు పొందుదామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో రూ. 4 కోట్లతో నిర్మించిన అంబేడ్కర్‌ కమ్యూనిటీ హాల్‌, ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలలో అన్ని కాలనీలలో వారు కోరిన అభివృద్ధి పనులను అనేకం చేపట్టామని, మరిన్ని చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఎక్కువ మంది ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న సమస్యలను గుర్తించి, వాటి నివారణకు పూర్తి స్థాయిలో కలసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

పురాతన బస్టాప్‌ కూల్చివేతపై ప్రయాణికుల ఆగ్రహం


బస్టాప్‌ తొలగించిన తర్వాత

శేరిలింగంపల్లి: పురాతన బస్టాప్‌ను కూల్చివేయడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్టాప్‌ లేకపోతే ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతాయని స్థానికులు వాపోతున్నారు. శేరిలింగంపల్లి డోయన్స్‌ కాలనీ గేట్‌ నెంబర్‌–1 వద్ద ఉన్న బస్టాప్‌ కొన్నేళ్లుగా కొనసాగుతోంది. దీన్ని కొందరు వ్యక్తులు సోమవారం మధ్యాహ్నం కూల్చివేశారు. దీంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా బస్టాప్‌ వెనుక భాగంలో ఉన్న బిల్డింగ్‌ నిర్మాణ సమయంలో అక్రమంగా నిర్మించిన సెల్లార్‌కు మార్గం కోసం బస్టాప్‌ను కూలివేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్టాప్‌ను ఇష్టానుసారంగా భవన యజమానులు కూల్చివేస్తే ఎలా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఈ బస్టాప్‌ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు. ఆర్టీసీ, పోలీసు అధికారులు వెంటనే జోక్యం చేసుకోవాలని వారు కోరుతున్నారు.

‘మనూ’లో ముగిసిన జాతీయ సెమినార్‌



రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి సెమినార్‌ ముగిసింది. ‘చరిత్ర–ముస్లిం చరిత్రకారులు’అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహించారు. ‘మనూ’లోని డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ ఇస్లామిక్‌ స్టడీస్‌, ఇస్లామిక్‌ ఫిఖ్‌ అకాడమీ ఆఫ్‌ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సాగిన ఈ సెమినార్‌లో వక్తలు మాట్లాడుతూ.. భారతదేశంలోని ముస్లిం చరిత్రకారుల చరిత్రపై అర్థవంతమైన, విద్యాసంబంధమైన అంశాలను వివరించారు. సమావేశానికి ‘మనూ’రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఇష్తియాక్‌ అహ్మద్‌ అధ్యక్షత వహించగా చరిత్ర ప్రొఫెసర్‌ దీపక్‌కుమార్‌, న్యూఢిల్లీలోని జామియామిలియా ఇస్లామియా సంస్కృతి విభాగం ప్రొఫెసర్‌ నిషాత్‌మంజార్‌ ప్రత్యేక ఉపన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీయూసీఏస్‌ ప్రొఫెసర్‌ ఎస్‌ఎం అజీజుద్దీన్‌హుస్సేన్‌, ఇస్లామిక్‌ స్టడీస్‌ విభాగం అధిపతి ప్రొఫెసర్‌ మహ్మద్‌ హబీబ్‌, సెమినార్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ అతీఫ్‌ఇమ్రాన్‌, ప్రొఫెసర్‌ మహ్మద్‌ షాహిమ్‌అక్తర్‌, డాక్టర్‌ మహ్మద్‌ సిరాజుద్దీన్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్లు డాక్టర్‌ ఇర్ఫాన్‌ అహ్మద్‌, జెషన్‌ సారా, అనీస్‌ అస్లామ్‌, ఇస్లామిక్‌ అధ్యయనకారులు, చరిత్ర నిపుణులు, ఉపాధ్యాయులు, పరిశోధనా పండితులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్‌: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలో సుమారు రూ.5.1 కోట్లతో సీసీ రోడ్లు, వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..డివిజన్‌ పరిధిలోని ఆదిత్యనగర్‌లో సుమారు రూ.73 లక్షలతో సీసీ రోడ్డు, ఇజ్జత్‌ నగర్‌లో రూ.69 లక్షలతో వరదనీటి కాలువ, హైటెక్‌ ఫుడ్‌ కోర్ట్‌ నుంచి యశోద హాస్పటల్‌ వరకు అంతేకాకుండా భారత్‌ పెట్రోల్‌ పంప్‌ నుంచి హైటెక్‌ సిటీ ఫ్లైఓవర్‌ వరకు రూ.2.62 కోట్లతో రోడ్డు విస్తరణ, గోకుల్‌ ప్లాట్స్‌లో రూ.93 లక్షలతో సీసీ రోడ్డుతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీల అసోసియేషన్‌ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ వెంకటేష్‌ గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌ కాలనీ డివిజన్‌ పరిధిలోని పీజేఆర్‌ నగర్‌లో ఫంక్షన్‌ హాల్‌, చిల్డ్రన్‌ పార్కు నిర్మాణ పనులను సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఏఇ రాజీవ్‌, వర్కు ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌, కాంగ్రెస్‌ నాయకులు అనిల్‌ రెడ్డి, భాస్కర్‌, యాదగిరి, ముజీబ్‌, పోశెట్టి గౌడ్‌, బాబునాయక్‌, రాజేందర్‌, అహ్మద్‌ పాల్గొన్నారు.

కాలనీ సమస్యలను పరిష్కరిస్తా


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌ కాలనీ సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు అన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ అధికారులు, కాలనీ వాసులతో కలిసి సోమవారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దశల వారీగా అభివృద్ధి పనులు చేపడతామని, అసంపూర్తి పనులను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, ఎలక్ట్రికల్‌, శానిటేషన్‌, ట్రాఫిక్‌ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్‌, సూపర్‌వైజర్‌ ఓం ప్రకాష్‌ , కాలనీ వాసులు రత్నప్రసాద్‌, యాదిరెడ్డి, రామకోటేశ్వరరావు, వెంకట్‌రావు, కృష్ణమూర్తి, హనుమంతు రాజు, బాబురావు, వెంకట్రామిరెడ్డి, ప్రకాష్‌ చౌదరి, బసవ లింగయ్య, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16వ తేదీ నుంచి మహా పాదయాత్ర

రాయదుర్గం: అయ్యప్పస్వాముల మహా పాదయాత్ర మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 16వ తేదీ నుంచి ఈ మహా పాదయాత్రను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు దివ్యజ్యోతి ఆడియోస్‌ నిర్మాతలు, మహా పాదయాత్ర వ్యవస్థాపకులు ముత్యంరెడ్డి, మాణిక్‌రెడ్డి సోమవారం తెలిపారు. గచ్చిబౌలి డివిజన్‌ నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయం వద్ద పూజలను నిర్వహించి పాదయాత్రను ప్రారంభిస్తామని వారు పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, కర్నాటక, కేరళ రాష్ట్రాల మీదుగా ఈ పాదయాత్ర 1,134 కిలోమీటర్లు సాగుతుందన్నారు. నవంబర్‌ 22వ తేదీ 38వ రోజు శబరిమలకు చేరుకోవడం జరుగుతుందని, అనంతరం సాంప్రదాయబద్ధంగా అన్ని కార్యక్రమాలు ముగించి స్వామి వారిని దర్శించుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహా పాదయాత్ర 5వ సారి నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే 94 మంది తమ పేర్లను రిజిస్టర్‌ చేసుకున్నారని, ఇంకా ప్రారంభించే రోజు వరకు వంద కంటే ఎక్కువ మంది బయలు దేరుతామన్నారు. అనంతపురం నుంచి నలుగురు భక్తులు, కర్నాటక రాష్ట్రం నుంచి మరో నలుగురు భక్తులు మహా పాదయాత్రలో కలుస్తారని వారు వివరించారు. ఉచితంగా భక్తులను ఈ మహా పాదయాత్రలో పాల్గొనేలా చేస్తున్నామన్నారు. మహా పాదయాత్రలో పాల్గొనే వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి


మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

చందానగర్‌: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం చందానగర్‌ సర్కిల్‌–21 కార్యాలయ ఆవరణలో మహిళా శక్తి క్యాంటీన్‌ను ఉప కమిషనర్‌ మోహన్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి జగదీశ్వర్‌ గౌడ్‌, కార్పొరేటర్‌ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌, ప్రాజెక్టు అధికారి ఉషారాణితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా శక్తి క్యాంటీన్‌ పీసీఐ ఇండియా గ్లోబల్‌ సంస్థ సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ కింద రూ.4 లక్షలు, బ్యాంక్‌ ఆర్థిక సహాయం ద్వారా రూ.4 లక్షలు కలిపి రూ.8 లక్షలతో క్యాంటీన్‌ ఏర్పాటయ్యిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన గొప్ప పథకం ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ అని, ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. త్వరలోనే మహిళా శక్తి క్యాంటీన్లు ప్రతి డివిజన్‌లో విస్తరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ రవీందర్‌రావు, రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, గౌతమ్‌ గౌడ్‌, మిరియాల రఘువరావు, జనార్దన్‌రెడ్డి, ఉరిటి వెంకట్‌రావు, అక్తర్‌, కరుణాకర్‌ గౌడ్‌, వెంకటేష్‌, అక్బర్‌ ఖాన్‌, విమల్‌ కుమార్‌ పాల్గొన్నారు.

‘ఐటీ’ ట్రాఫిక్‌ నియంత్రణ ఎలా?

అధికారులతో సైబరాబాద్‌ సీపీ అవినాశ్‌ మహంతి సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌ నియంత్రణ విషయంలో నెలకొన్న సమస్యలపై సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ అవినాశ్‌ మహంతి, జాయింట్‌ కమిషనర్‌ జోయెల్‌ డేవిస్‌... ఐటీ ఇండస్ట్రీ పెద్దలతో సమావేశమయ్యారు. సోమవారం జరిగిన సమావేశంలో హైటెక్‌ సిటీ, ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ సమస్య తీవ్రంగా ఉంటోందని, ఇందుకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక పరిష్కారంపై చర్చించారు. అలాగే ఏ సమయంలో ఏ కంపెనీ ఉద్యోగులు ఎక్కువగా వస్తున్నారనే సమాచారం సేకరించిన తర్వాత అందుకు అనుగుణంగా.. షిఫ్టుల విషయంలో మార్పులు చేపట్టాలని, తద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చునని పలువురు సూచించారు. పెద్ద పెద్ద భవనాలకు కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను మానిటర్‌ చేస్తే బాగుంటుందని మరొకొందరు పేర్కొన్నారు. కార్పొరేట్‌ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్‌) నిధులను ఉపయోగించి ట్రాఫిక్‌ మార్షల్స్‌ నియమించాలని మరికొందరు తెలిపారు. హైటెక్‌సిటీలో, ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతాల్లో ప్రజారవాణాను మెరుగుపర్చడమే కాకుండా, పార్కింగ్‌ ఏర్పాట్లు, రాయదుర్గం మెట్రో స్టేషన్‌ వద్ద బస్‌ స్టాండ్‌, ఇమేజ్‌ టవర్ల నిర్మాణం చేపడితే ట్రాఫిక్‌ సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు. పాదచారుల కోసం ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిలు నిర్మించడం, ఐటీ పార్కుల్లో సెంట్రల్‌ ట్రాన్స్‌పోర్టేషన్‌ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సొసైటీ ఫర్‌ సైబర్‌ సెక్యూరిటీ కౌన్సిల్‌ సెక్రటరీ రమేశ్‌ ఖాజా, హైసియా ప్రెసిడెంట్‌ ప్రశాంత్‌ నాదెళ్ల తదితరులు పాల్గొన్నారు.

సమస్యపై డీసీకి ఫిర్యాదు

రాజేంద్రనగర్‌: తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్‌ యువజన సంఘం, గ్రేవ్‌ యార్డ్‌ కమిటీ రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్‌ సర్కిల్‌ ఉపకమిషనర్‌ రవి కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బంగారు మైసమ్మ దేవాలయ ప్రహరీ గోడ ధ్వంసం అయ్యిందని, ప్రహరీ కూడా నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ సహకరించాలని ఉప కమిషనర్‌ను కలిసి కోరినట్లు తెలిపారు. అలాగే వరదనీరు వెళ్లేందుకు కాలువను ఏర్పాటు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. అందుకు ఉపకమిషనర్‌ సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

నేడు అన్నదానం

రాజేంద్రనగర్‌: దేవీశరన్నవరాత్రి కార్యక్రమంలో భాగంగా బుద్వేల్‌ గ్రీన్‌ సిటీ పోచమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ చైర్మన్‌ రజనీకాంత్‌ గౌడ్‌ తెలిపారు. ఉదయం ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.